సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



ఇమామ్, మౌజన్లకు అన్యాయం

రాష్ట్రంలోని మౌజన్లు, ఇమామ్‌లకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మదీనా దస్తగిరి అన్నారు. -8లో



తూతూ మంత్రం.. రాయితీ రుణం

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 300 మందికి మాత్రమే రాయితీ రుణాలు మంజూరు చేయడం విచారకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు తెలిపారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.8/19.4

జిల్లాలో మంగళవారం 19.4 – 35.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వైవీయూ వీసీగా ప్రకాష్‌బాబు నియామకం



కడప ఎడ్యుకేషన్: కడప యోగివేమన విశ్వ విద్యాలయ నూతన వైస్ చాన్సులర్‌గా ఫణితి ప్రకాష్‌బాబు నియమితులయ్యారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉత్తర్వు మేరకు విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫణితి ప్రకాష్‌బాబు ప్రస్తుతం యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాదులో డిపార్టుమెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మాటిక్స్, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ లో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. కాగా ఆయన నేడో, రేపో బాధ్యతలను చేపట్టనున్నట్లు సమాచారం.

గండికోటను సందర్శించిన పర్యాటక శాఖ ఎండీ



గండికోట అభివృద్ధిపై చర్చిస్తున్న ఎండీ అజయ్ జైన్,ఎమ్మెల్యే, కలెక్టర్

జమ్మలమడుగు: ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటను రాష్ట్ర పర్యాటకశాఖ ఏండీ అజయ్ జైన్ సందర్శించారు. మంగళవారం కలెక్టర్ శ్రీధర్ చెరకూరి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డిలతోకలిసి వెళ్లారు. ఈ సందర్భంగా పెన్నాలోయ అందాలతోపాటు, మాధవరాయ స్వామి ఆలయం, జుమ్మామసీదు, రంగనాథస్వామి దేవాలయంతోపాటు ధాన్యాగారాన్ని సందర్శించారు. అనంతరం గండికోటలో జరుగుతున్న అభివృద్ధి పనులు, జరగాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆదితో చర్చించారు.

ప్రభుత్వాస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలి



అట్లూరు పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

అట్లూరు: ప్రభుత్వాస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు కె.నాగరాజు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓపీ సేవలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని లంకమల్లేశ్వర క్షేత్రంలో మెడికల్ క్యాంపు నిర్వహించాలని సూచించారు. అనంతరం మాడపూరు పంచాయతీ పరిధిలోని చిన్నరాజుపల్లిలో జరుగుతున్న బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగు పరీక్షల సర్వేను ఆయన పరిశీలించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రమేష్, స్థానిక వైద్యాధికారి డాక్టరు హమీదాబేగం, సీహెచ్‌ఓ మురళీకృష్ణ, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, సూపర్‌వైజరు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బాలల ప్రగతికి బాసట

- పోషణ్ భీ, పడాయి భీ కార్యక్రమం అమలు
- ఆరు రోజులపాటు అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ
- అంగన్వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా అభివృద్ధి



ఆటపాటలతో విద్యను నేర్పుతున్న అంగన్వాడీ కార్యకర్త



కడప కోటిరెడ్డిసర్కిల్: పిల్లల ప్రగతి కోసం కేంద్రం మరో పథకానికి శ్రీకారం చుట్టింది. భావి భారతం విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యమూ కలిగి ఉండాలన్న లక్ష్యంతో 'పోషణ్ భీ.. పడాయి భీ' పథకం అమలు చేస్తోంది. ముఖ్యంగా చిన్నారులు తొలి అడుగులు వేసే అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి పెట్టింది. జాతీయ విద్యా విధానం అమల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు అనేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా చిన్నారుల విద్యతోపాటు ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కాగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పోషణ్ భీ, పడాయి భీ' అనే పథకంపై అవగాహన కోసం అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇస్తున్నారు. ప్రారంభ బాల్య సంరక్షణ విద్య (ఎర్లీ చైల్డ్ ఫుడ్ కేర్ ఎడ్యుకేషన్... ఈసీసీఈ)పై మహిళ శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ బాధ్యతలను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో ఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ (ఎన్ఐ పీసీసీడీ)కి అప్పగించారు.

నూతన విద్యా విధానం అనుసరించి...

- నూతన విద్యా విధానం అనుసరించి అంగన్వాడీ కేంద్రాలలో నాణ్యతతో కూడిన పోషకాహారం, మౌలిక సదుపాయాలు, ఆట పరికరాలను సమకూరుస్తూ శిక్షణ పొందిన కార్యకర్తలతో మాతృభాషలోనే ఈసీసీఈ విధానాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.
- ఆరేళ్లలోపు చిన్నారులకు ఎదుగుదల, శారీరక చలన కండరాల అభివృద్ధితోపాటు మాట్లాడే విధానం, వస్తువులను లెక్కించడం, సాంఘిక, భావోద్వేగ అభివృద్ధి, రంగులను గుర్తించడం, బొమ్మలను వేయడం తదితర పనులు చేయించడంపై శిక్షణ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

ఆరు రోజులపాటు శిక్షణ

జిల్లాలో 13 ప్రాజెక్టులలో 2389 అంగన్వాడీ కేంద్రాలలో మంగళవారం నుంచి 2320 మంది కార్యకర్తలకు శిక్షణ ప్రారంభమైంది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,02,235 మంది చిన్నారులు ఉన్నారు.

పోషకాహారం, విద్యకు ప్రాధాన్యం

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం పిల్లలకు ఆరేళ్ల వయస్సులోనే 85 శాతం మెదడు అభివృద్ధిని సాధిస్తుంది. ఆ సమయంలో సరైన పోషణ, విద్యను అందించడం ఎంతో అవసరం. ఇందుకోసం కేంద్రం 'పోషణ్–భీ, పడాయి భీ' కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. పిల్లల శారీరక, అభివృద్ధి, సామాజిక, భావోద్వేగ, నైతిక అభివృద్ధి, సాంస్కృతిక, కళాత్మక అభివృద్ధి, కమ్యూనికేషన్, మాతృభాష, అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం అభివృద్ధే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారుల పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకునేందుకు, అలాగే వైద్య సేవలు అందించేందుకు పోషణ్ భీ, పడాయి భీ కార్యక్రమాన్ని ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలకు మంగళవారం నుంచి శిక్షణ తరగతులను ప్రారంభించాం. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

– డి.శ్రీలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్, కడప

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి

కడప ఎడ్యుకేషన్/కడప కోటిరెడ్డి సర్కిల్: విద్యాశాఖ బలోపేతానికి పూర్వ ప్రాథమిక విద్య ప్రథమ ప్రాధాన్యత వహిస్తుందని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ నిత్యానందరాజులు అన్నారు. కడప నగరంలోని జయనగర్ నగర్ కాలనీలోగల జెడ్పీ బాలికల పాఠశాలలో 'పోషణ్ భీ, పడాయి భీ' పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్లకు ఇస్తున్న ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా సమగ్ర శిక్ష, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ..అంగన్వాడీ రెండు అనుసంధానంగా పని చేయాలన్నారు. కడప మండల విద్యాశాఖ అధికారి దుద్దికుంట గంగిరెడ్డి మాట్లాడుతూ బాల్యం నుంచే అభివృద్ధికి మైలురాళ్లు ఏర్పడాలని తెలిపారు. న్యూ క్లస్టర్ విధానంలో బేసిక్ ప్రైమరీ స్కూల్‌లకు అంగన్వాడీలను అనుసంధానం చేస్తూ పూర్వ ప్రాథమిక విద్య ..ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం ప్రారంభించిందన్నారు. జిల్లా జ్ఞానజ్యోతి డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ కిరణ్ రథం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 2383 మంది అంగన్వాడీ వర్కర్స్‌కు శిక్షణ ఇవ్వనట్లు పేర్కొన్నారు. ఐసీడీఎస్, విద్యాశాఖ సమగ్రంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా పూర్వ ప్రాథమిక విద్య బలపడుతుందని పేర్కొన్నారు. అనంతరం కి రిసోర్స్ పర్సన్ (ఏసిడిపిఓ) శోభారాణి, సూపర్వైజర్ ప్రశాంతి వర్కర్లకు పలు సూచనలు చేశారు. కడప నగరంలోని ఆరు సెక్టార్ల సూపర్‌వైజర్లు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజులు

అశ్వ వాహనంపై శ్రీరంగనాథుడు



పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలోని శ్రీరంగ నాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా 8వరోజు మంగళవారం రాత్రి శ్రీరంగనాథ స్వామి అశ్వవాహనంపై భక్తులను కరుణించారు. స్వామివారు వేట మార్గమున వెలుతున్న తీరును కళ్లకు కట్టినట్లుగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరంగనాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల గుండా ఊరేగించారు. గ్రామోత్సవంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. తిరుణాల ప్రాంగణంలో రాత్రి పులివెందుల శ్రీశివజ్యోతి నాటక కళానికేతన్ వారిచే నవరత్నాలు స్టేజీ నాటక ప్రదర్శన నిర్వహించారు. రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు నేటితో ముగియనున్నాయి. చివరిరోజు బుధవారం శ్రీరంగనాథుడు సతీసమేతుడై హంసవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పటిష్టంగా ఇరవై సూత్రాల అమలు

చైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న లంకా దినకర్, చిత్రంలో కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: ఇరవై సూత్రాల కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని చైర్మన్ లంకా దినకర్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. గత ఐదేళ్లలో ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ కింద ఖర్చు చేసిన వివరాలు అందజేయాలన్నారు. అలాగే మెటీరియల్ కాంపోనెంట్ వ్యయం ద్వారా కల్పించిన ఆస్తుల నాణ్యత, నిబంధనలకు విరుద్ధంగా చేసిన వ్యయంపై విచారణ చేయాలని ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ కింద పూర్తయినట్లు చూపుతున్న పనుల్లో నాణ్యతపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. 1922 గ్రామాల్లో 2.91 లక్షల గృహాలకుగాను 2.77 లక్షల గృహాలకు నీటి కొళాయిలు బిగించినట్లు లెక్కలు ఉన్నప్పటికీ కుళాయిల్లో నీరు రావడం లేదన్నారు. గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి జిల్లాలోని ఐదు దీర్ఘకాలిక నీటి వనరుల ద్వారా రక్షిత తాగునీరు ఇచ్చే లక్ష్యంతో సవరించిన డీపీఆర్‌తో జల్‌జీవన్ మిషన్ అమలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం డ్రోన్లపై సబ్సిడీ ఇస్తోందన్నారు. జిల్లాలో 5600 టిడ్కో గృహాల్లో 3296 పూర్తయినట్లు, 80 శాతం మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేసినట్లు లెక్కలు చెబుతున్నప్పటికీ ఆ గృహాల్లో నివాసం ఉంటున్న వారు సున్నా కావడం బాధాకరమన్నారు. కడప కార్పొరేషన్‌లో అమృత్ 1.0 కింద చేపట్టిన పనులు ఏడేళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదన్నారు. ఇప్పుడు అమృత్ 2.ఓ కింద 663 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు తయారు చేశారన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి మాట్లాడుతూ పంటలకు విపరీతమైన పురుగు మందులు వాడకం వల్ల ఆహారం విషపూరితం కాకుండా ఇరవై సూత్రాల్లో కొత్త విధానాలను తీసుకు రావాలన్నారు. అధ్వాన్నంగా తయారైన కాంక్రీట్ రోడ్లకు మరమ్మత్తులు చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కోరారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో పరిశ్రమలు, పర్యాటకం ప్రధాన భూమిక పోషించనున్నాయన్నారు. కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తలనీలాల వేలం పాట రూ.5.51 లక్షలు

సిద్దవటం: నిత్యపూజ స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల వేలం పాటను బాపట్ల జిల్లా అద్దంకి గ్రామానికి చెందిన వంగపాటి మహేంద్ర రూ. 5.51లక్షలకు దక్కించుకున్నారని ఆలయ ఈఓ మోహన్ రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలం వంతాటిపల్లె గ్రామ సమీపంలోని లంకమల్ల అడవుల్లో వెలసిన నిత్యపూజస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలకు మంగళవారం సిద్దవటంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో బహిరంగ వేలం పాట ర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యపూజ స్వామి ఆలయంలో ఫిబ్రవరి 25 నుంచి 27వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులు స్వామివారికి సమర్పించుకునే తలనీలాల ప్రోగు కోసం ఈ వేలం పాటను నిర్వహించామన్నారు.



వేలం పాటను నిర్వహిస్తున్న ఆలయ ఈఓ

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- అబద్ధపు హామీలతో అధికారంలోకి చంద్రబాబు
- ప్రజా దర్బార్‌లో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి




ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

పులివెందుల రూరల్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని ధ్వజమెత్తారు. మంగళవారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలోని ఆయన నివాసంలో ఎంపీ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీ పథకాలలో ఒకటీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. అధికారం కోసం చంద్రబాబు వందలాది హామీలు ఇచ్చారన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ చంద్రబాబుకు ఎందుకు ఓట్లు వేసి గెలిపించామా అని బాధపడుతున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి జరిగిందన్న విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం ఆయన ప్రజల సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆర్టీసీ అధికారిపై విచారణ

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఓ అధికారి అవినీతిపై విచారించేందుకు విజయవాడ నుంచి ఉన్నతాధికారి ఒకరు మంగళవారం కడపకు వచ్చారు. సదరు అధికారిపై ఎండీకి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ మేరకు విచారణ నిమిత్తం అధికారిని నియమించారు. ఈ మేరకు ఆయన కడపకు చేరుకుని పలు విషయాలపై విచారించినట్లు తెలిసింది. అలాగే ఫిర్యాదుదారు వివరాలు ఆరా తీసినట్లు సమాచారం.

భారతీయ సంస్కృతికి ప్రతీక రామాయణం





మాట్లాడుతున్న ఆచార్య కృష్ణారెడ్డి, కార్యక్రమానికి హాజరైన అతిథులు, సాహితీ ప్రముఖులు

కడప కల్చరల్ : రామాయణ మహాకావ్యం భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిందని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'తెలుగులో రామాయణాలు– సామాజిక దృక్పథం' అనే అంశంపై జరుగుతున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో భాగంగా మంగళవారం ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత ఒంటిమిట్ట కోదండరామాలయం ప్రధానార్చకులు వీణా రాఘవాచార్యులు అతిథులతో కలిసి రాములవారి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ రామాలయం లేని గ్రామం లేదని, అందులోని ప్రతి పాత్ర సందేశమిస్తుందన్నారు. సభాధ్యక్షుడు, ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ రామాయణాన్ని ఆధ్యాత్మిక గ్రంథంగా కాకుండా ఆధునిక సమాజానికి పనికొచ్చే గ్రంథంగా చూడాలన్నారు. ఈగ్రంథం మానవాళికి చేసే మేలు గురించి తెలియజెప్పేందుకే ఈ సదస్సు నిర్వహిస్తున్నామని వివరించారు. సదస్సు సమన్వయకర్త, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ రామాయణాన్ని వివిధ కవులు రచించారని, వారి రచనా దృక్పథంతో వెలువడిన వివిధ సామాజిక అంశాలను పత్రాల ద్వారా వెలుగులోకి తీసుకురావడం ఈ సదస్సు ఉద్దేశమన్నారు. కీలకోపన్యాసకులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య కె.మలయవాసిని మాట్లాడారు. విశిష్ట అతిథి, కృష్ణాజిల్లా రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచంద్ , గౌరవ అతిథి స్వామి అనుపమానంద, ఆత్మీయ అతిథి, చిన్మయా మిషన్ సంచాలకులు స్వామి తురియానంద తదితరులు ప్రసంగించారు.

- అనంతరం జరిగిన సదస్సుల్లో దేశ విదేశాలకు సంబంధించిన ప్రతినిధులు, సాహితీవేత్తలు నేరుగాను, అంతర్జాలంలోనూ పత్ర సమర్పణ చేశారు. సాయంత్రం 5.30 గంటలకు భారతీయ నృత్య సంస్థాన్‌కు చెందిన 30 మంది నృత్య కళాకారులు 'సీతారామ కల్యాణం' నృత్యరూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి సభను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైవీయూ తెలుగుశాఖ అధ్యక్షురాలు ఆచార్య ఎంఎం వినోదిని, అధ్యాపకులు ఆచార్య టి.రామప్రసాద రెడ్డి, ఆచార్య పి.రమాదేవి, ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళా.. రైలెక్కేదెలా!

- 26తో ముగియనున్న కుంభమేళా
- గుత్తి–రేణిగుంట మార్గంలో ఒక్క రైలు కూడా లేని వైనం
- ప్రయాగ్‌రాజ్ ప్రయాణానికి ఇక్కట్లు
- రహదారి మార్గాల్లో ట్రాఫిక్ సమస్యలు



రాజంపేట: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా విశేషాలపై చర్చ సాగుతోంది. ఈనెల 26న మహాశివరాత్రి రోజు మహాకుంభమేళా వేడుకలు ముగియనున్నాయి. 144 ఏళ్లకొకసారి వచ్చే ఈ ఉత్సవాల సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానం ఆచరించడం మంచిదని భక్తుల అచంచల విశ్వాసం. అందుకే ప్రయాగ్‌రాజ్‌కు నడిపిస్తున్న రైళ్లు భక్తులతో రద్దీగా మారుతున్నాయి. ఎంతగా అంటే తత్కాల్ టికెట్లు కూడా క్షణాల్లో రిజర్వు కావడం డిమాండ్‌ను తెలియజేస్తోంది.

రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ వల్ల ఒరిగిందేమీలేదు: భారతీయ రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా వైఎస్సార్ జిల్లాకు చెందిన ఎంపీ సీఎం రమేష్ ఉన్నప్పటికీ ఈ ప్రాంతానికి మేలు చేసే విధంగా కనిపించడంలేదని జిల్లా ప్రజలు విమర్శిస్తున్నారు. రైల్వేబోర్డుకు స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా తాను సిఫార్సు చేసి ఉంటే కుంభమేళాకు రైలు నడిపేవారు. అయినా ఆయన జిల్లా మీదుగా కుంభమేళాకు రైలు వేయించుకోలేక పోయారని భక్తులు పెదవి విరుస్తున్నారు.

ప్రైవేటు వాహనాలు, బస్సులను ఆశ్రయించే పరిస్థితి..

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వాసులు కుంభమేళాకు వెళ్లేందుకు రైలు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలు, బస్సులను ఆశ్రయించే పరిస్థితులు నెలకొన్నాయి. కొందరు భక్తులు గ్రూపులుగా ఏర్పడి ప్రత్యేకంగా బస్సులు మాట్లాడుకొని వెళుతున్నారు. ఇలా వెళ్లే వారి సంఖ్య పెరిగిపోవడంతో ప్రయాగ్‌రాజ్ దారులు రద్దీగా మారుతున్నాయి. ఫలితంగా గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. కొందరు బెంగళూరు, చెన్నై నుంచి విమానాల ద్వారా కుంభమేళాకు వెళుతున్నారు.

గుత్తి–రేణిగుంట లైనులో ఒక్క రైలేదీ..

గుత్తి–రేణిగుంట లైనులో కుంభమేళాకు వెళ్లేందుకు ఒక్క రైలు కూడా నడిపించలేదు. ఫలితంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వాసులు ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే రైళ్ల గురించి తెలుసుకొని వ్యయ ప్రయాసాలతో గూడూరుకు వెళ్లి, అక్కడి నుంచి రైళ్ల ద్వారా చేరుకుంటున్నారు. తిరుపతి నుంచి కూడా ఇప్పుడు కుంభమేళాకు రైలు నడవడంలేదని రైల్వే వర్గాలు అంటున్నాయి. ఉత్తరప్రదేశ్‌కు వెళ్లే రైళ్లు సదరన్ రైల్వే నుంచి వస్తే వాటిని ఆశ్రయించాల్సి వస్తోంది.

ఇంటర్‌సిటీనే కుంభమేళా రైలుగా నడిపించాలి

ఈ మార్గంలో నడిచే పేదోళ్ల రైలు ఇంటర్‌సిటీ(హుబ్లీ–తిరుపతి) రద్దు చేసి, ఆ రైలును కుంభమేళాకు వినియోగించారు. అదే రైలును ఈ మార్గంలో నడిపించాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఈ రైలును తిరుపతి నుంచి ప్రయాగ్‌రాజ్‌కు రోజూ నడిపిస్తే రాయలసీమ ప్రాంత భక్తులకు ఉపయోగపడేది. ఆ దిశగా రైల్వేశాఖ ఆలోచించకపోవడం విచారకరమని హిందూ సంస్థల ప్రతినిధులు వాపోతున్నారు.

జిల్లా వాసులు రైలులో వెళ్లలేని పరిస్థితి



ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వాసులు కుంభమేళాకు వెళ్లలేని పరిస్థితి. రైలు సౌకర్యం ఉంటే వేలాదిమంది వెళ్లేవారు. రైలులో గూడూరు నుంచే వెళ్లాలి. టిక్కెట్లు దొరకవు. జనరల్ బోగీలలో వెళితే సీట్లు ఉండవు. నానా కష్టాలు పడాలి. జిల్లా రైలు మార్గంలో రైలు నడిపించకపోవడం దారుణం. మన ప్రాంతంపై రైల్వే వివక్ష చూపుతోంది. –భూమన శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, నాగిరెడ్డిపల్లె

కుంభమేళాకు రైలు వేయాలని జీఎంను కోరా



జిల్లా మీదుగా కుంభమేళాకు ఒక రైలు నడపాలని ఇటీవల తిరుపతిలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఏకే జైన్‌ను కలిసి విన్నవించాను. కుంభమేళా ముగిసే లోపు ఒక్కసారి అయినా రైలు నడిపిస్తే భక్తులు సద్వినియోగం చేసుకుంటారు. రద్దయిన ఇంటర్‌సిటీనే కుంభమేళాకు ఏర్పాటు చేయాలి. –తల్లెం భరత్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యుడు, గుంతకల్

సురక్షితం.. సౌకర్యం..

ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే వారికి రైళ్లు సురక్షితం. తక్కువ ఖర్చుతో గమ్యానికి చేరుకోవచ్చు. దీంతోపాటు రైల్వేస్టేషన్ నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలోనే త్రివేణి సంగమం చేరుకోవచ్చు. అక్కడే పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు తక్కువ ఖర్చుతో సకాలంలో చేరుకొనే వీలుంటుంది. వాహనాలు లభ్యంకాని భక్తులు నేరుగా నడకమార్గం ద్వారా చేరుకునే అవకాశాలు ఉన్నాయి. రైల్వేశాఖకు రూ.కోట్ల ఆదాయం కూడా సమకూరుతుంది.

క్లుప్తంగా

22న ఉర్దూ సాహిత్యంపై జాతీయ సదస్సు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వ విద్యాలయంలో ఈ నెల 22న ఉర్దూ కవిత, సాహిత్యంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉర్దూ విభాగం ఆచార్యులు రియాజున్నీసా తెలిపారు. సదస్సులో ఉర్దూ సాహిత్యం, దాని ప్రాముఖ్యత, ఉర్దూ స్థితి, కడపలో ఉర్దూ సాహిత్యంతిపై చర్చ జరుగుతుందని తెలిపారు. ప్రవచన కర్తలు తమ వ్యాసాలను ప్రదర్శిస్తారని చెప్పారు. సాహిత్య వర్గాలు, అధ్యాపకులు, విద్యార్థులంతా సదస్సులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అదనపు సమాచారం కోసం 9885348482లో సంప్రదించాలన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన న్యాయమూర్తి



హాస్టల్ భోజనం పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ మరియాపురం, శంకరాపురం, ప్రకాశ్‌నగర్ లలోని హాస్టళ్లను మంగళవారం తనిఖీ చేశారు. వంటశాల, వసతి గదులు, డైనింగ్ హాల్, స్టోర్ రూము పరిసరాలతోపాటు టాయిలెట్లను పరిశీలించారు. తగు సూచనలు, సలహాలిచ్చారు. విద్యార్థులకు వసతి సౌకర్యాలు, భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు

ఎస్సీ వర్గీకరణకు ఆదేశాలు జారీ చేయాలి



మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

కడప రూరల్ : ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ అన్నారు. స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలకు, డీఎస్సీ నియామకాలు ఏబీసీడీ వర్గీకరణ ప్రకారమే చేపట్టాలన్నారు. అందుకు అనుగుణంగా మార్చిలో ఎస్సీ వర్గీకరణ అమలుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ అంశానికి సంబంధించి ఈ నెల 20న విజయవాడలోని గాంధీ నగర్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాలయాపన చేయకుండా ఎస్సీ వర్గీకరణ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీ.ఆంజనేయులు, ఓబులేసు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు వేళాయె.. సందడి లేదాయె?

ప్రముఖ శైవ క్షేత్రంగా కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి దేవస్థానం విరాజిల్లుతోంది. అంత వైభవం కలిగిన త్రేతేశ్వరుడి వేడుకల నిర్వహణలో కూటమి ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోంది. మహాశివరాత్రి మహోత్సవాల సందడి కనపడడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దేవస్థానంలో సమస్యలు అలాగే ఉండిపోయాయి.

- త్రేత్రేశ్వరస్వామి ఆలయంలో కానరాని ఏర్పాట్లు
- శివరాత్రి మహోత్సవాలపై అయోమయం
- 9 రోజుల వేడుకలకు మంగళమేనా?
- అత్తిరాలపై కూటమి ప్రభుత్వం అలసత్వం



కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి దేవస్థానం



అత్తిరాల ముఖద్వారం వద్ద అసంపూర్తిగా ఉన్న రహదారి

రాజంపేట రూరల్ : ఉమ్మడి జిల్లాలలో ప్రముఖ శైవ పుణ్య క్షేత్రం కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి దేవస్థానంలో ఏటా శివరాత్రి మహోత్సవాలను అత్యంత వైభవంగా తొమ్మిది రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పాలకులు ఎవరైనా ఈ అలయానికి ప్రత్యేకత చూపడం సంప్రదాయంగా వస్తోంది. ఉత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది బహుదా నదిలో పుణ్య స్నానాలు చేస్తారు. అగస్త్యేశ్వర మహర్షి ప్రతిష్ఠించిన త్రేతేశ్వరస్వామి, గదాధర స్వామిని దర్శించుకోవడం వరంలా భావిస్తారు. దీంతోపాటు అత్తిరాలలోనూ ఏటా శివరాత్రి ముందు రోజు, తరువాత రోజు, శివరాత్రి పర్వదినం రోజున పలు కార్యక్రమాలు చేపడతారు.

పాలక మండలి ఏర్పాటు ఎప్పుడో?.

త్రేతేశ్వర దేవస్థానంలో నిర్వహించే శివరాత్రి మహోత్సవాలకు ముందే పాలక మండలి ఏర్పాటుచేయడం ఆనవాయితీ. అలా వీలుకాని పక్షంలో తాత్కాలిక చైర్మన్‌ను నియమించి శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. దేవస్థానం చైర్మన్ పదవి, పాలక మండలిపై మందరం, అత్తిరాల, అప్పయ్యరాజుపేట, పోలీ, సీతారామపురం కూటమి నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడచినా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై ప్రజలలో అయోమయం నెలకొంది.

22 నుంచి ఉత్సవాలు జరిగేనా?

శివరాత్రి మహోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభించి మార్చి 02వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉంది. సమయం తక్కువగా ఉండడంతో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారా? లేక వేడుకలకు మంగళం పాడతారా? అని భక్తులు సంశయం వ్యక్తం చేస్తున్నారు. శివరాత్రి పర్వదినానికి నెల రోజుల నుంచి హడావిడి ఆరంభమయ్యేది. అన్ని శాఖల అధికారులతో డివిజనల్ స్థాయి(ఆర్‌డీఓ లేక సబ్ కలెక్టర్) అధికారి సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేస్తారు. అత్తిరాలను ఉన్నతాధికారులు సందర్శించి దేవాదయశాఖతో సమన్వయం చేసుకని ఏర్పాట్లు ప్రారంభిస్తారు. అయితే ఈ ఏడాది ఈ వాతావరణం కనిపించకపోవడం అనుమానాలకు దారితీస్తోంది.

సౌకర్యాల ఊసే లేదు

శివరాత్రి మహోత్సవాలకు దాదాపు 7 నుంచి 15 రోజుల ముందు వాహనాల గేటుకు ఎంపీడీఓ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇప్పటివరకూ వేలం వేయక పోవడం వెనుక అంతర్యమేమిటో అర్థంకాక భక్తులు తలలు పట్టుకుంటున్నారు. దీనికి తోడు రాజంపేట-నెల్లూరు ప్రధాన రహదారిలోని అత్తిరాల ముఖ ద్వారం వద్ద నుంచి త్రేతేశ్వర దేవస్థానం వరకు రోడ్డు సమస్య పీడించేది. కమ్మపల్లిలో మాత్రం కొంత దూరం సిమెంటు రహదారి ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ సిమెంటు రోడ్డు ప్రారంభించాలని తలపెట్టినా అర్ధంతరంగా కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో రహదారికి ఇరువైపులా గుంతలు, మట్టి దిబ్బలు అలాగే ఉన్నాయి. అత్తిరాలకు విచ్చేసే భక్తులకు పార్కింగ్ సమస్యలు తప్పవు. రహదారి నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

లబోదిబోమంటున్న వ్యాపారులు

శివరాత్రి మహోత్సవాలలో చిరు అంగళ్లు ఏర్పాటు చేసుకొని జీవించాలనుకొనే వ్యాపారులు లబోదిబోమంటున్నారు. త్రేతేశ్వరుని దేవస్థానం సమీపంలో రహదారి నిర్మాణం అలాగే ఉండడంతో వ్యాపారులు అంగళ్లను ఏర్పరుచుకోనే వీలులేదు. ఇప్పటి నుంచే అంగళ్లు ఏర్పరుచుకోకుంటే అప్పటికప్పుడు కష్టంగా ఉంటుంది. వాహనాలలో సమాగ్రినీ తీసుకెళ్లేందుకు వీలు కాకపోవడంతో ఎంతో నష్టపోతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంక స్థలం ఆక్రమణ



అధికార పార్టీ నేతలు చదును చేసి ఆక్రమించిన వంక పోరంబోకు స్థలం

- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- ఆక్రమించింది టీడీపీ నేత కావడమే కారణం

కడప టాస్క్‌ఫోర్స్ : ప్రభుత్వ స్థలాలు అప్పనంగా కాజేస్తున్నా.. ప్రజా ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సిద్ధవటం మండలం దిగువపేట నందు బద్వేల్ రోడ్డు ప్రక్కనే ఉన్న రూ.50 లక్షల విలువైన స్థలం ఆక్రమణకు గురైంది. దిగువపేట పెద్ద కుమ్మరి గుంతకు ఎదురుగా ఉన్న ఈ స్థలాన్ని టీడీపీ నాయకులు స్థానిక మండల నేతల అండదండలతో దౌర్జన్యంగా చదును చేసి ముళ్ల కంచె వేశారు. సుమారు 0.43 సెంట్ల స్థలాన్ని దిగువపేట గాంధీ నగర్ హరిజన వాడ ప్రజలు కర్మ కాండలకు వినియోగిస్తున్నారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే పెద్ద కర్మ ఇక్కడే చేసుకుంటారు. భర్త చనిపోయిన మహిళలకు ఇక్కడే వితంతువుగా మారుస్తారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఇది కొంత ప్రభుత్వ భూమిగా, మరి కొంత వంకపోరంబోకుగా ఉంది. ఈ వంకపై ప్రభుత్వం ఒక మోరీ గతంలో నిర్మించింది. ప్రస్తుతం అధికార పార్టీ నాయకులు ఈ వంకను నామరూపాలు లేకుండా చేశారు. బద్వేల్ మెయిన్ రోడ్డు ప్రక్కనే ఉన్న విలువైన స్థలాన్ని చదును చేసి ఆక్రమిస్తుంటే కూతవేటు దూరంలో ఉన్న రెవెన్యూ అధికారులకు తెలియకపోవడం ఏమిటని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ స్థలం విషయంలో రెవెన్యూ అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టినట్లు వారు గుసగుసలాడుతున్నారు. కలెక్టర్ దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిని టీడీపీ కబ్జాదారుల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

తూతూ మంత్రం.. రాయితీరుణం

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 300 మందికి మాత్రమే రాయితీపై రుణాలు మంజూరుచేయడం విచారకరమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. దొరసానిపల్లెలోని తన స్వగృహంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ మూడు లక్షల జనాభా గల నియోజకవర్గంలో 300 యూనిట్ల సబ్సిడీ రుణాలు మంజూరుకాగా, 3వేల మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. 300 మందిని ఎంపిక చేస్తే మిగిలిన 2,700 మంది పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. 60 వేల ఓటర్లు గల చేనేతలకు 40, 20 వేల ఓటర్లు గల యాదవులకు 15, ఆర్య వైశ్యులకు 2, బ్రాహ్మణులకు 1 చొప్పున రుణాలు మంజూరుచేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సిఫారసు చేసిన వారికే రుణాలు వస్తాయని, ఒక్కో రుణానికి ఆయా వార్డుల శ్రేణులు రూ.30 వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా దళారీ వ్యవస్థ లేకుండా రూ.2.72 లక్షల కోట్లు మంజూరుచేశారన్నారు. అప్పట్లో ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ఎంపీపీలతోపాటు ఏ నాయకుల పాత్ర ఎంపికలో లేదన్నారు. జగన్‌ఒబటన్ నొక్కితే అర్హత ఉన్న వారి ఖాతాకు డబ్బు వచ్చేదన్నారు. సచివాలయాల ఉద్యోగుల నియామకానికి, మంత్రుల పలుకుబడి కూడా పనిచేయలేదని, నిజాయితీగా ఉద్యోగులను ఎంపిక చేశారన్నారు. పాలిచ్చే ఆవును వద్దనుకుని తన్నే దున్నపోతును తెచ్చుకున్న చందాన ప్రజల పరిస్థితి ఉందన్నారు. 300 మందికి అన్న క్యాంటీన్‌లో భోజనం పెట్టి గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. గుంతలు పూడ్చి హైవే రోడ్లను నిర్మించినట్లు చెబుతున్నారన్నారు. ప్రభుత్వ పాలన చూస్తే 11 సీట్లు కూడా ఎన్డీఏ కూటమికి వచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, పాతకోట వంశీధర్‌రెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, గుర్రం లావణ్య, చౌడం రవీంద్ర, దేస్ రామ్మోహన్‌రెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో సీమను విస్మరిస్తే ఉద్యమం



మాట్లాడుతున్న జి.ఈశ్వరయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నీటి పారుదల శాఖ రాయలసీమను విస్మరిస్తే ఉద్యమం చేపడతామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు కడపలో జరిగే ప్రాజెక్టుల ప్రాంతీయ సదస్సు కార్యాచరణ వేదిక కానుందన్నారు. రూ.80 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన గోదావరి - భనకచర్ల ఎత్తిపోతల పథకం కాంట్రాక్టర్ల కడుపు నింపి ఎన్నికల నిధి పోగు చేసుకోవడానికి ఉపయోగపడుతోందని ఆరోపించారు. కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరణ ద్వారా శ్రీశైలంలో క్యారీ ఓవర్ నీళ్లను రాయలసీమ ప్రాజెక్టులకు వాడుకునే వెసులుబాటు ఉంటుందని చెబుతూ వచ్చారని, నేడు కొత్త ప్రతిపాదనల పేరుతో రాయలసీమ ప్రజలను మభ్యపెడుతున్నారని వాపోయారు. పోలవరం పూర్తిచేస్తే పట్టిసీమకు ప్రాధాన్యం ఉండదని తెలిసినా రూ.1600 కోట్ల రూపాయలు ఖర్చు చేశారన్నారు. సీమ ప్రాజెక్టులకు రూ.10వేల కోట్లు కేటాయిస్తే ప్రాధాన్యత క్రమంలో పంట కాల్వల నిర్మాణం పూర్తయి పది లక్షల ఎకరాల ఆయకట్టు అభివృద్ధి చెందుతుందని ఆరోపించారు. కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్వార్థ రాజకీయాలతో ఎగువ భద్ర ప్రాజెక్టుకు బీజేపీ ప్రభుత్వం జాతీయ హెూదా కల్పించిందన్నారు. శ్రీశైలం నీటిమట్టం 834 అడుగులకు రాకముందే నీటిని తోడేస్తున్నారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట శివ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్లకు అన్యాయం



మాట్లాడుతున్న మదీనా దస్తగిరి

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలోని మౌజన్లు, ఇమామ్‌లకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మదీనా దస్తగిరి అన్నారు. స్థానిక మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇమామ్‌లు, మౌజన్లకు నెలకు రూ.15వేల చొప్పున ఇచ్చేవారని, 2024లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి 11 నెలలుగా వారికి గౌరవవేతనం ఇవ్వలేదన్నారు. ఇప్పటి వరకూ వారికి రూ.90 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, ప్రభుత్వం రూ.45కోట్లు ఇవ్వడానికి జీవో విడుదల చేయడం అన్యాయమన్నారు. రానున్న రంజాన్ మాసంలో ఎక్కువ ఖర్చులు ఉంటాయని, ప్రభుత్వం ఆ మిగిలిన రూ.45 కోట్లు విడుదల చేయాలన్నారు. కడప అసెంబ్లీ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు ఎస్ఎండీ.షఫీ మాట్లాడుతూ గతంలో హజ్‌కు పోయే వారికి విజయవాడ నుంచి అధిక టికెట్లు ఉంటే అప్పటి సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆ భారాన్ని ప్రభుత్వమే భరించేలా ఉత్తర్వులిచ్చారని గుర్తు చేశారు. వక్ఫ్ ఆస్తులను ఆక్రమించడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో వైఎస్సార్‌సీపీ మాత్రమే వ్యతిరేకించిందని గుర్తు చేశారు. హజ్ కమిటీ మాజీ చైర్మెన్ గౌస్‌లాజం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముస్లిం, మైనార్టీలకు ఒరిగిందేమీ లేదన్నారు. 3529 మందిని ఒకేసారి హజ్‌కు పంపిన ఘనత వైఎస్ జగన్‌దేనన్నారు. జగనన్న ప్రభుత్వంలో ముస్లింలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.23వేల కోట్లు జమ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంద్‌బాషా, అతావుల్లా, మియ్యా, అహమ్మద్ పాల్గొన్నారు.

ఇద్దరు ట్రాన్స్‌ఫార్మర్ దొంగల అరెస్టు

– 180 కిలోల కాపర్ తీగలు, పల్సర్ బైక్ స్వాధీనం

చక్రాయపేట : ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైరు చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు. గాలివీడు క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. పోలీసులను చూసి నిందితులు పారి పోయేందుకు ప్రయత్నించారన్నారు. పోలీసులు పట్టుకుని విచారించినట్లు తెలిపారు. వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా 12 పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లోని 27 ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైరు దొంగిలించినట్లు వారు అంగీకరించారని చెప్పారు. వారి అరెస్టు అనంతరం కడప విమానాశ్రయం వద్ద కంపచెట్లలో దాచిన 180 కిలోల కాపర్ వైరు, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పాడు. నిందితులు చెన్నూరు మండలం శాటిలైట్ సిటీ సమీపాన ఉన్న రుద్రభారత్‌పేటకు చెందిన ఈభూది మల్లికార్జున, శంకల శంకర్ అని చెప్పారు. దొంగలను పట్టుకున్న సీఐ ఉలసయ్య, ఎస్సై కృష్ణయ్య, సిబ్బందిని డీఎస్పీ మురళి అభినందించారు.

విద్యార్థిని ఆత్మహత్య

– పాఠశాలకు వెళ్లి చదువుకోలేక...!




సుచిత్ర (ఫైల్)

కడప అర్బన్ : పాఠశాలకు వెళ్లడం లేదని మందలించినందుకు విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కడప నగర శివారులోని చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. కడప చిన్నచౌక్ పోలీసుల ప్రాథమిక విచారణ, మృతురాలి బంధువుల వివరాలిలా వున్నాయి. దేవకుమార్, ప్రభావతిల కుమారుడు మస్తానయ్య, సన్నీ కుమార్తె సుచిత్ర ఉన్నారు. మస్తానయ్య తన తండ్రితో పాటు బేల్దారిపనికి వెళుతున్నాడు. తల్లి ప్రభావతి ఇంటింటా పనులు చేసి జీవనం సాగించేది. సుచిత్ర మున్సిపల్ మెయిన్ హైస్కూల్‌లో పదోతరగతి చదువుతోంది. సుచిత్ర తన అనారోగ్యం కారణాలతో నెలకు 15 రోజులు మాత్రమే పాఠశాలకు వెళ్లేది. హాజరు సరిగా లేక ఇటీవల పాఠశాలలో ఉపాధ్యాయులు ఆమె తల్లిదండ్రులను ఆరా తీశారు. దీంతో మానసిక ఆవేదనకు గురైన విద్యార్థిని సుచరిత తల్లిదండ్రులు, అన్న, తమ్ముడు వెళ్లిపోయిన తరువాత ఇంటిలోపల గడియ వేసుకుని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుని ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుప్రక్కల వాళ్లు గమనించి తల్లిదండ్రులకు, పోసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని చిన్నచౌక్ సీఐ ఓబులేసు ఆదేశా మేరకు ఎస్ఐ పి.రవికుమార్, తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రాథమికంగావిచారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కల దాడిలో మేకల మృతి

వేంపల్లె : పట్టణంలోని కడప రోడ్డులో నివాసముంటున్న సుధాకర్‌కు చెందిన మేకలపై మంగళవారం తెల్లవారుజామున వీధి కుక్కలు దాడి చేశాయి. నాలుగు మేకలు మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. కుటుంబ పోషణకు మేక పిల్లలను పెంచుకుంటున్నానని, కుక్కల దాడితో రూ.50 వేల నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం పరిహారం అందించేలా చూడాలని కోరారు.

బొలెరో వాహనం ఢీకొని పొట్టేళ్లు దుర్మరణం



మృతి చెందిన పొట్టేళ్లు

కొండాపురం : కడప–తాడిపత్రి నాలుగు వరసల జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో పొట్టేళ్లు మృతి చెందాయి. బాధితుడి వివరాల మేరకు.. చౌటిపల్లె గ్రామానికి చెందిన సుబ్బారెడ్డికి చెందిన పొట్టేళ్లు కడప–తాడిపత్రి రహదారి దాటుతున్నాయి. మండలంలోని గండ్లూరు సమీపంలో బొలెరో వాహనం వేగంగా ఢీకొనడంతో 12 పొట్టేళ్లు మృతి చెందాయి. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

విద్యుత్తు తీగలు తగిలి.. కాలిన టిప్పర్



గాయపడిన నాగార్జున

ఎర్రగుంట్ల : మండలంలోని చిన్నదండ్లూరు సమీపంలో విద్యుత్తు తీగలు తగలి టిప్పర్ కాలిపోయిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చిన్నదండ్లూరు గ్రామానికి గ్రావెల్ రోడ్డు వేస్తున్నారు. ఈ తరుణంలో టిప్పర్‌లోని మట్టిని రోడ్డుపై వేసేందుకు ట్రాలీ పైకెత్తగా.. పైన విద్యుత్తు తీగలను తాకింది. దీంతో ప్రమాదం జరిగి మంటలు వ్యాపించాయి. కొలవలి గ్రామానికి చెందిన డ్రైవర్ నాగార్జునకు గాయాలయ్యాయి. కలమల్ల పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు.

దొరసానిపల్లెలో చోరీకి విఫలయత్నం

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని దొరసానిపల్లెలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. దొరసానిపల్లె సాయిబాబా గుడి సమీపంలో నివాసం ఉంటున్న భూమా రాజా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అతను బెంగళూరు నుంచి అప్పుడప్పుడూ దొరసానిపల్లెలోని ఇంటికి వచ్చి వెళ్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు రాజా ఇంటి తాళాలు పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా లాకర్లు తెరవడానికి ప్రయత్నించగా అవి తెరుచుకోలేదు. దుండగులు చేసేదేమిలేక వెనక్కి వెళ్లిపోయారు. స్థానికులు గమనించి రాజాకు సమాచారం తెలియజేశారు. ఈ మేరకు రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ వెంకట సురేష్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎవరైనా ఇంటికి తాళం వేసి బయటి ఊళ్లకు వెళ్లాల్సివస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు. పోలీసులకు తెలిపితే ఎల్‌హెచ్‌ఎంస్‌తో పనిచేసే నిఘా కెమెరాలను వారి ఇంట్లో ఏర్పాటు చేయిస్తామన్నారు. చోరీల నివారణకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని సీఐ కోరారు.

రేపు వామపక్షాల సదస్సు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రజా వ్యతిరేక పొలిటికల్ బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 20 వామపక్షాల జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. నగరంలోని రామకృష్ణ నగర్‌లో వామపక్ష పార్టీల ఉమ్మడి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పొలిటికల్ బడ్జెట్ ప్రవేశపెట్టారని ఆరోపించారు. 70 శాతం అణగారిన ప్రజలను విస్మరించారని, మధ్య తరగతి ప్రజలను భ్రమలకు గురిచేసే విధంగా ఉందని తెలిపారు. గ్రామీణ నిరుపేదల ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చారన్నారు. వివిధ రాష్ట్రాలలో జరుగుతున్న ఎన్నికలకు ముందు భ్రమలకు గురి చేసే బడ్జెట్ ప్రవేశపెట్టారని, కార్పొరేట్ల పెరుగుదలకు 42 శాతం ప్రజాధనాన్ని దోచిపెట్టే విధంగా అంకెల గారడి ఉందన్నారు. ప్రాజెక్టులు, శాస్త్ర, సాంకేతిక పరిశోధనలకు, దీర్ఘకాలిక అభివృద్ధికి నిధులు విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో అన్వేష, రామ్మోహన్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరుత సంచార ప్రాంతాల్లో సీసీ కెమెరాలు



పొలంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

పులివెందుల రూరల్ : చిరుత, వాటి పిల్లలు సంచరించే ప్రాంతాల్లో అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇటీవల చిరుత సంచారం గురించి వివిధ గ్రామాల ప్రజలు కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి దృష్టికి తెచ్చారు. ఆయన కడప జిల్లా ఫారెస్ట్ అధికారి వినీత్ కుమార్‌కు ఫోన్ చేసి చిరుత సంచరిస్తున్న గ్రామాలలో సీసీ కెమెరాలు, బోన్లు ఏర్పాటు చేయాలని ఎంపీ కోరారు. స్పందించిన అధికారులు మంగళవారం నల్లపురెడ్డిపల్లె, సింహాద్రిపురం, లింగాల మండలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా చిరుత సంచారం, అడుగుజాడలు కనిపిస్తే ఫారెస్ట్ అధికారులకు తెలియజేయాలని అటవీ అధికారులు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ మానవత్వం





మృతి చెందిన వెంకటసుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి భార్యను ఓదార్చుతున్న హెడ్ కానిస్టేబుల్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని వెదుర్ల బజారుకు చెందిన వెంకటసుబ్బారెడ్డి (71) గతంలో కూరగాయల మార్కెట్‌లో పనిచేశారు. మంగళవారం వెంకట సుబ్బారెడ్డికి అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఆయన భార్య రామసుబ్బమ్మ అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేర్చే లోపే ఆయన చనిపోవడంతో ఇంటికెలా తీసుకెళ్లాలో తెలియక రోదిస్తూ ఉండిపోయింది. పోలీస్ ఔట్ పోస్టు హెడ్ కానిస్టేబుల్ షబ్బీర్‌బాషా విషయం తెలుసుకుని ఓ ప్రైవేట్ అంబులెన్స్‌ను పిలిపించి మృతదేహాన్ని ఇంటికి పంపించడంతోపాటు, అవసరమైతే హిందూ సంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలు జరిపిస్తానని ఆమె తెలిపారు. షబ్బీర్‌బాషా మానవత్వాన్ని పలువురు అభినందించారు. వెంకటసుబ్బారెడ్డికి ఇద్దరు కుమారులుండగా ఒకరి మానసికస్థితి బాగాలేదు. మరో కుమారుడు ప్రైవేట్ బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు.

ట్రాలీ కింద పడి మహిళ మృతి

రాజుపాళెం : మండలంలోని పర్లపాడు గ్రామానికి చెందిన దారాల ఆరోగ్యమ్మ (52) ట్రాక్టర్ ట్రాలీ కింద పడి మంగళవారం మృతి చెందినట్లు రాజుపాళెం ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. ఆ గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో శనగ పంట కోతకు వెళ్లిన ఆరోగ్యమ్మ పొలం వద్దనే ఉన్న ట్రాక్టర్ ట్రాలీ వద్ద సేద తీరుతోంది. డ్రైవర్ నిర్లక్ష్యంగా ట్రాక్టర్ తోలడంతో ఈ సంఘటన చోటు చేసుకుందన్నారు. ట్రాలీ కింద పడిన ఆరోగ్యమ్మకు తీవ్ర గాయాలవడంతో చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు అక్కడి వైద్యులు చెప్పారు. మృతురాలి కుమారుడు దారాల చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. శవాన్ని ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.